సాక్షి
బాపట్ల
శనివారం । 9 । నవంబర్ । 2024



అభివృద్ధి పనుల పరిశీలన

చిలకలూరిపేట: పలు అభివృద్ధి పనులను నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పుల్లారావు, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ శుక్రవారం పరిశీలించారు.



అభివృద్ధిలో ప్రజలూ భాగస్వాములు

తెనాలిఅర్బన్: పట్టణాభివృద్ధిలో ప్రజలూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని 32వ వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు.



వినాయక గుడి పునఃప్రతిష్ఠ

ముప్పాళ్ల: దమ్మాలపాడులో వినాయక గుడి పునఃప్రతిష్ఠ, నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం జరిగాయి. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీ నారాయణ, అరవిందబాబు పూజలు చేశారు.

రియల్‌పై పచ్చ పంజా!

- జిల్లాలో 274 లే అవుట్లు అనధికారికమని ప్రకటన
- ప్లాట్లు కొంటే వసతులు కల్పించబోమని వెల్లడి
- అధికారుల తీరుతో కుదేలైన స్థిరాస్తి వ్యాపారం
- ఇదే అవకాశంగా పచ్చ నేతల వసూళ్ల పర్వం
- రోడ్డున పడ్డ రియల్టర్లు, ప్లాట్ల కొనుగోలుదారులు
- అసలు పక్కాగా ప్లాన్ చేసిందే పచ్చ నేతలని ఆరోపణలు

పచ్చనేతల వసూళ్ల దందా పుణ్యమాని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జిల్లాలో వెలిసిన పలు వెంచర్లు అనధికారికమని, వాటికి ఎటువంటి అనుమతులు లేవని అధికారులు రెండు నెలల క్రితం ప్రకటించారు. ఇంతవరకు వాటిపై ఎటువంటి నిర్ణయం వెలువరించకపోవడంతో రియల్టర్లతోపాటు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు. కొందరు పచ్చనేతలు, అధికారులు కలిసి రియల్టర్ల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లు చేసుకునేందుకు అనధికార లే అవుట్ల వ్యవహారం నడిపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బాపట్లలో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా వ్యాప్తంగా అనధికారిక లే అవుట్లపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా 274 వెంచర్లు అనధికారికంగా వెలసినట్లు పేర్కొన్నారు. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 104, రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో 40 అద్దంకి, చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 91 వెంచర్లు ఉన్నట్లు వెల్లడించారు. సదరు వెంచర్లలో ఎవరూ ప్లాట్లు కొనకూడదని ప్రకటించారు. వెంచర్లలో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొన్నా, ప్రభుత్వ పరంగా ఎలాంటి వసతుల కల్పన జరగదని అధికారులు భయపెట్టారు. ఈ చర్యలతో జిల్లాలో రియల్ ఎస్టేట్ కుదేలైంది. అధికారుల ప్రకటనలతో ప్లాట్లు కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వెంచర్లు వెలవెలబోయాయి. అప్పటికే ప్లాట్లు కొన్నవారు లబోదిబోమనే పరిస్థితి వచ్చింది. బాపట్లతోపాటు చీరాల, రేపల్లె ప్రాంతాల్లోని చాలావరకు వెంచర్లలో ఇప్పటికే పెద్ద ఎత్తున ప్లాట్లు కొన్నవారు ప్రభుత్వ ప్రకటనతో ఆందోళనలో పడ్డారు. కొనుగోలు చేసినవారిలో చాలా మంది లోకాయుక్తను ఆశ్రయించారు. అనధికార లే అవుట్ల వివరాలను తమకు నివేదించాలని లోకాయుక్త.. జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడంతో కలెక్టర్ ఇప్పటికే నివేదిక అందజేసినట్లు సమాచారం. అనధికార లే అవుట్ల జాబితా తమ వద్దకు పంపలేదని, రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని ఆదేశాలు కూడా లేవని సంబంధిత అధికారులు చెప్పడంతో ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది.


రిజిస్ట్రేషన్లు ఆపడానికి చర్యలు శూన్యం

వాస్తవానికి అనధికార లే అవుట్లు అనుకుంటే రిజిస్ట్రేషన్లు ఆపాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఆ శాఖకు అలాంటి ఆదేశాలు వెళ్లలేదంటే కొందరు పచ్చ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి రియల్టర్లను బెదిరించి పెద్ద ఎత్తున డబ్బులు దండుకునేందుకు పథకం రచించడమే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి అనధికారికంగా కొన్ని వెంచర్లు ఉన్నా... అన్నీ అనధికారమంటూ నోటీసులు ఇవ్వడంపై కొందరు రియల్టర్లు మండిపడుతున్నారు. కొత్తగా కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు పచ్చనేతలు రియల్ వెంచర్ల నుంచి డబ్బులు గుంజేందుకు ఈ వ్యవహారం తెరపైకి తెచ్చినట్లు పచ్చ పార్టీలోనే పలువురు పేర్కొంటున్నారు. డబ్బులు వసూళ్లలో గతంలో బాపట్ల కమిషనర్‌గా ఉన్న వ్యక్తి కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలొచ్చాయి.

రెండు సామాజికవర్గాలే లక్ష్యంగా...

రియల్ ఎస్టేట్‌లో ఇక్కడ రెండు ప్రధాన సామాజికవర్గాలు ఉన్నాయి. కొందరు పచ్చ నేతలకు ఇది మింగుడు పడలేదు. వారిని ఆర్థికంగా బలోపేతం కానివ్వకూడదన్న ఎత్తుగడతోనే వారి వెంచర్లపై పడినట్లు సమాచారం. ఈ వ్యవహారం బాపట్ల ఎంపీతోపాటు జిల్లా మంత్రుల వద్దకు చేరింది. బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఇందుకు బాపట్ల పచ్చ నేత ససేమిరా అన్నారు. దీంతో వ్యవహారం ముదిరింది. చీరాల, రేపల్లె ప్రాంతాల్లోనూ ఇదే రీతిలో పచ్చ నేతలు వసూళ్లకు దిగినట్లు సమాచారం. 20 సంవత్సరాల క్రితం వేసిన వెంచర్ల నుంచి సైతం పచ్చ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారు. ముడుపులు ఇవ్వకపోతే వెంచర్లు నిలిపి వేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో రియల్టర్లతోపాటు ప్లాట్లు కొన్న బాధితులు లబోదిబోమంటున్నారు.

కనీసం స్పందించని ప్రభుత్వం



ఈ వ్యవహారం రెండు నెలలుగా నడుస్తున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ మంత్రి సొంత జిల్లాలో పచ్చనేతల వసూళ్ల వ్యవహారం పతాక స్థాయికి చేరడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక వేళ నిజంగానే అనధికార లేఅవుట్లు ఉంటే వాటికి సంబంధించిన లోటుపాట్లు వెల్లడించాలని బాధితులు కోరుతున్నారు. అందుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి ఏమైనా రుసుములు చెల్లించాల్సి వస్తే రియల్టర్లు ఇచ్చేలా నిబంధనలు పెట్టాలని, ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రతి విద్యార్థి పేరు, వివరాలను నిక్షిప్తం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సర్వే, అపార్ ఐడీ నమోదు ప్రక్రియపై అనుబంధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అపార్‌లో విద్యార్థుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల సమగ్ర వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్లోనే వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో 77,934 మంది ప్రైమరీ విద్యార్థులు ఉండగా 65,811 మంది వివరాలను నిక్షిప్తం చేయడంతో అపార్ ఐడీ వచ్చిందన్నారు. అప్పర్ ప్రైమరీలో 56,834 మందికిగాను 43,753 మందికి కూడా ఈ ఐడీలు వచ్చాయన్నారు. సెకండరీలో 35,001 మందికి గాను 19,918 మందికి ఐడీలు వచ్చాయని, హయ్యర్ సెకండరీ (ఇంటర్మీడియట్)లోని 19,354 మందికి గాను 3,854 మంది ఐడీలు పొందారని వివరించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. వైద్యశాలల్లోని జనన ధ్రువీకరణ పత్రాల దస్త్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన వాటిని సవరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇందుకోసం ఆధార్ కేంద్రాలను ఆయా ప్రాంతాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం చీరాల, బాపట్ల, కర్లపాలెం మండలాలలో నమోదు ప్రక్రియ జాప్యంపై ఆరా తీశారు. విద్యార్థుల సమగ్ర వివరాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్‌ఐఓ ఎర్రయ్య, ఆర్డీవోలు, డీఎల్‌డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం



విడదల రజిని



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ మంత్రి విడదల రజినిని చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. గుంటూరు నగర డెప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమాండ్ బాబు)ను తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

రూ.10 లక్షల విలువైన అక్రమ ఎరువుల నిల్వల సీజ్

వినుకొండ (నూజెండ్ల) : అక్రమంగా నిల్వ ఉంచిన బయో ఉత్పత్తులను వ్యవసాయ శాఖ అధికారులు సీజ్ చేశారు. వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఎరువులను ఏడీఏ బోయపాటి రవిబాబుతోపాటు, వ్యవసాయ శాఖ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.10 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. విచారణ అనంతరం వ్యాపారుల లైసెన్సు కూడా రద్దు చేస్తామని తెలిపారు.

నేడు విజయవాడలో వలంటీర్ల ఆవేదన సదస్సు




లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడలో శనివారం ఆవేదన సదస్సు నిర్వహిస్తున్నట్టు అఖిల భారత యువజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి జిల్లాలోని వలంటీర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు వలంటీర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు దానిని నిలబెట్టుకోలేదని విమర్శించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ ఆవేదన సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొంటారని వివరించారు.

యార్డులో 41,224 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 37,450 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 41,224 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,200 నుంచి రూ. 17,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,623 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 5706 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 292 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1089 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 540 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 398 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు విడుదల చేశారు.

‘వెలుగు’లో చీకటి రాజకీయాలు

- పంగులూరులో ముదిరిన నేతల ఒత్తిడి వ్యవహారాలు
- గతంలో దౌర్జన్యంగా 18 మంది వీవోఏలు తొలగింపు
- హైకోర్టును ఆశ్రయించడంతో వారికి సానుకూల తీర్పు
- విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలున్నా స్పందించని అధికారులు
- ఆందోళన ఉధృతం చేస్తామని బాధిత వీవోఏల హెచ్చరిక

జే.పంగులూరు: వెలుగు కార్యాలయంలో కూటమి రాజకీయాలు ప్రవేశించడంతో మునుపెన్నడు లేని విధంగా డ్వాక్రా మహిళల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని వెలుగు కార్యాలయంలో పనిచేసే అధికారులు ఆధిపత్య రాజకీయాలకు లొంగిపోయారంటూ పలు డ్వాక్రా సంఘాలు, వీవోఏలు విమర్శించారు. శుక్రవారం బాధిత వీవోఏలు వెలుగు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. మండలంలో సుమారు 1,200 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 10 మంది సభ్యులు ఉన్నారు. పొదుపు చేసుకుంటూ, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరికి సహాయ సహకారాలు అందిస్తూ 30 మంది వీవోఏలు పని చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలంలోని 18 మంది వీవోఏలను తొలగించింది. వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. తొలగించిన వారిలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం వారిని విధుల్లోకి తీసుకోకుండా గ్రామ సంఘాల తీర్మానాలు ఉంటే విధుల్లోకి తీసుకుంటామని చెబుతున్నారని బాధితులు తెలిపారు. ఈ విషయం మండలంలో నెల రోజులుగా చర్చనీయాంశమైంది.




ధర్నా చేస్తున్న వీవోఏలు

ఆందోళన ఉధృతం చేస్తాం..

తాజాగా శుక్రవారం కూడా బాధిత వీవోఏలు, కొంత మంది డ్వాక్రా సంఘాల లీడర్లతోపాటు మండల సీఐటీయూ కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి తలపనేని రామారావులు వెలుగు కార్యాలయానికి వచ్చారు. కార్యాలయంలో ఉన్న ఏపీఎం జ్యోతి ప్రసాద్‌ను నిలదీశారు. కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారమే వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని, గ్రామాల్లో ఉన్న రాజకీయ ఒత్తిళ్లకు లొంగవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న వీవోఏలను, గ్రామ సమాఖ్య సంఘం నాయకురాలు నాగలక్ష్మిని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. కొత్తగా తీసుకున్న వారిని మాత్రం గ్రామ సంఘాల తీర్మానాలు లేకుండానే ఎలా నియమించారని ఏపీఎంను నిలదీశారు. దీనికి ఏపీఎం జ్యోతి ప్రసాద్ వివరణ ఇస్తూ గ్రామ సంఘాల తీర్మానాల ద్వారానే తాము విధుల్లోకి తీసుకునే అవకాశం ఉందని, తాము సొంతంగా ఏమీ చేయలేమని సమాధానం ఇచ్చారు. వీవోఏలను తక్షణమే విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వీవోఏలు, డ్వాక్రా సభ్యులు హెచ్చరించారు. అనంతరం కార్యాలయం ముందు బాధిత వీవోఏలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వీవోఏలు బండి సావిత్రి, ఈరేళ్ల హేమలత, మీరాబీ, చింతకాయల అనూష, నార్నె శ్రీదేవి, డ్వాక్రా సభ్యులు గోపిరాణి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంద్రం తీరాన సంధ్య సోయగం



సముద్ర తీరంలో సూర్యాస్తమయ సమయంలో సేద తీరాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. ఆ సమయంలో క్షణానికొక అద్భుత చిత్రం దర్శనమిస్తుంటుంది. శుక్రవారం సాయంత్రం 5.15 గంటల సమయంలో చీరాల మండలం వాడరేవు సముద్ర తీరం వద్ద కూడా సంద్రానికి భానుడు వీడ్కోలు చెబుతున్నట్లు ఓ దృశ్యం ఆవిష్కృతమైంది. భానుడి కిరణాలు సముద్రపు తీరాన్ని తాకి సువర్ణ శోభితంగా సోయగాన్ని పర్యాటకులకు పంచాయి. - చీరాల టౌన్

నల్ల చెరకు .. లాభాల సరకు

- బల్లికురవ, అద్దంకి మండలాల్లో సాగుకు రైతుల ఆసక్తి
- మొత్తం 960 ఎకరాల్లో చెరకు తోటలు
- సానుకూల వాతావరణంతో ఆశాజనకంగా దిగుబడి

బల్లికురవ: వ్యవసాయంలో లబ్ధి పొందాలంటే భూసారాన్ని అనుసరించి సీజన్‌లో ఉండే గిట్టుబాటు ధరను బట్టి పంటలు సాగు చేయాలి. అప్పుడు అధిక లాభాలు పొందవచ్చు. ఇదే తరహాలో నల్ల చెరకు సాగు చేస్తున్న రైతులు తమ ప్రత్యేకత నిరూపిస్తున్నారు. వరి సాగుకు పెట్టుబడి వ్యయం పెరగటం, వాతావరణంలో మార్పులతో అద్దంకి నియోజకవర్గంలో రైతులు కొత్త దారిలో వెళ్తున్నారు. తిరునాళ్ల, జాతర్లలో విక్రయించే నల్ల చెరకు సాగు విస్తీర్ణం పెంచారు. 12 ఏళ్ల క్రితం బల్లికురవ మండలం గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాల్లో 10 ఎకరాల్లో చెరకు పెంచారు. లాభాలు బాగా వస్తుండడంతో బల్లికురవ, అద్దంకి మండలంలో ఈ ఏడాది 960 ఎకరాలకు చేరింది. గతేడాది 800 ఎకరాల్లో తోటలు ఉన్నాయి. వేసవి దుక్కులతో బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు, వైదన, కొప్పెరపాడు, ఎస్ ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, కొత్తూరు, అద్దంకి మండలంలోని సింగరకొండపాలెం, చక్రాయపాలెం గ్రామాల్లో వేసవి దుక్కులతో జూన్, జూలై మాసాల్లో చెరకు సాగు చేపట్టారు. ఎకరాకు ఐదు ట్రక్కుల ఎరువును భూమిలో చల్లి కలియదున్నాలి. తొలకరి వర్షాలకు భూములు పదునెక్కగానే ట్రాక్టర్‌తో బోదెలు చేసి ఆ బోదెల్లో అడుగు సైజున్న చెరకు ముక్కలను ఎకరాకు 12 వేల నుంచి 13 వేల వరకు నాటుకోవాలి. రవాణా, నీటి వసతులు ఉన్న సారవంతమైన భూముల ఎంపిక కీలకం. నీటి ఆదాకు కొందరు రైతులు బోరుకు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకుని సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో గడలు నాలుగు నుంచి ఐదు అడుగుల మేర ఎత్తు పెరిగినట్లు రైతులు ఎంపరాల సుబ్బారావు, ఇలసాగరపు పేరయ్య, భవనం శ్రీనివాసరెడ్డి తెలిపారు.



కూకట్లపల్లిలో సాగులో ఉన్న చెరకు తోట

ఎకరాకు రెండు లక్షలు..

ఆరంభం నుంచి సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల 9 – 10 నెలలకు గడలు సుమారు 7 అడుగుల ఎత్తు పెరిగి విక్రయానికి సిద్ధమవుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగే తిరునాళ్ల, ఉత్సవాలకు గడలను తరలిస్తారు. ఎకరాకు 22 వేల నుంచి 24 వేల వరకు గడలు వస్తాయి. గత ఏడాది ఒక్కో గడ రూ.20 పలికింది. పెట్టుబడులు పోను ఎకరాకు రైతులకు సగటున రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఎకరా సాగుకు సొంత భూమి రైతులకు రూ.లక్షన్నర, కౌలు రైతులకు రూ.2లక్షల వరకు పెట్టుబడులు అవుతున్నాయి.

దళారుల బెడద లేదు



8 సంవత్సరాలుగా నల్ల చెరకు సాగు చేస్తున్నాను. అర ఎకరాతో ప్రారంభించి ఇప్పుడు రెండు ఎకరాల వరకు సాగు పెంచా. దళారుల బెడద లేకుండా వ్యాపారులే తోటల వద్దకు వచ్చి గడల వంతున కొనుగోలు చేస్తున్నారు.

– గోగులమూడి శ్రీనివాసరెడ్డి, రైతు

సలహాలు పాటిస్తున్నాం



పదేళ్లుగా చెరకు సాగు చేస్తున్నాను. ఇక్కడ భూములు అనుకూలంతోపాటు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నాం. అందువల్ల సాగులో అధిక దిగుబడులు వచ్చి లాభాలు వస్తున్నాయి.

– ఇప్పల అంజిరెడ్డి, రైతు

సాగుకు అలవాటు పడ్డారు



తిరునాళ్ల, జాతరలో విక్రయించే నల్ల చెరకు సాగుకు కూకట్లపల్లి ప్రాంత రైతులు అలవాటు పడ్డారు. గతేడాది తోటల్లో మేలైన గడలను విత్తనపు గడలుగా ఉంచారు. సాగు ఆరంభం నుంచి సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

– ఎస్వీపీ కుమారి, ఏవో, బల్లికురవ మండలం


క్రీడా సంబరం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాలురకు, సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో బాలికలకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లు హాజరయ్యాయి. ముందుగా సత్తెనపల్లి శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు ఫుట్‌బాల్ అందించారు. క్రీడాకారులతో కరచాలనం చేసి పోటీలు ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. అనంతరం క్రీడాకారులు పలు విన్యాసాలను ప్రదర్శించారు.



సత్తెనపల్లిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

బాలికల లీగ్ మ్యాచ్ ఫలితాలు



తొలిరోజు బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు 3-0 గోల్స్ తేడాతో, నెల్లూరు జిల్లా జట్టుపై విశాఖపట్నం జిల్లా జట్టు 6-0 గోల్స్ తేడాతో, కర్నూలు జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జిల్లా జట్టు 1-0 గోల్స్ తేడాతో గెలిచాయి. నెల్లూరు జిల్లా జట్టుపై జరిగిన మరొక మ్యాచ్‌లో చిత్తూరు జిల్లా జట్టు 5-0 గోల్స్ తేడాతో, కృష్ణా జిల్లా జట్టుపై మరో మ్యాచ్‌లో విశాఖపట్నం జిల్లా జట్టు 3-0 గోల్స్ తేడాతో, తూర్పుగోదావరి జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 10- 0 గోల్స్ తేడాతో, కర్నూలు జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 4-0 గోల్స్ తేడాతో విజయం సాధించాయి.

క్లుప్తంగా

మత్స్యకార భరోసా నిధులు విడుదల చేయాలి

నిజాంపట్నం: మత్స్యకారులకు మత్స్యకార భరోసా నిధులు విడుదల చేయాలని ఏపీ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ కొపనాతి నాగబాబు కోరారు. నిజాంపట్నంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను మచిలీపట్నంలో కలిసి దీనిపై వినతిపత్రం అందించామన్నారు. దీనికోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరామన్నారు. వేట నిషేధ సమయంలో ప్రతి సంవత్సరం గత వైసీపీ ప్రభుత్వం రూ. 10 వేల చొప్పున అందించిందని నాగబాబు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రూ.20 వేల చొప్పున ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి ఇప్పటివరకూ అందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇకనైనా నిధులు విడుదల చేయాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

మార్టూరు: జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని జొన్నతాళి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. జొన్నతాళి గ్రామానికి చెందిన ఇండేల సింగారెడ్డి భార్య శ్రీలక్ష్మి (35) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు మార్టూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నరసరావుపేటలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీలక్ష్మి శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో మృతి చెందింది. దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీలక్ష్మి తండ్రి కొప్పుల కాశిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

నెహ్రూనగర్: ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ డి. మధుసూదనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తదుపరి పరీక్ష జరిగే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న లావు రత్తయ్య


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

- విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- ఉత్సాహంగా జిల్లా యూత్ ఫెస్టివల్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చేబ్రోలు: చిన్న వయసు నుంచే విద్యార్థులు ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే ఇతివృత్తంతో కార్యక్రమం ఏర్పాటైంది. వివిధ కళాశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్టెప్ సీఈవో టీవీ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముందుగా లావు రత్తయ్య, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ జ్యోతి ప్రజ్వలనతో యువజనోత్సవాలను ప్రారంభించారు. అనంతరం లావు రత్తయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకమైన పాలసీ తీసుకురావాలన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, స్టెప్ మేనేజర్ బి.రాధిక, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన వారి వివరాలను స్టెప్ సీఈవో టీవీ విజయలక్ష్మి వెల్లడించారు. గ్రూపు ఫోక్ డ్యాన్స్‌లో జేకేసీ కళాశాల, హిందూ కళాశాల తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఫోక్ డ్యాన్స్ సోలోలో జి.అర్షిత, ఎం. త్రివేణి, గ్రూపులో జేకేసీ కళాశాల, విజ్ఞాన్ ధ్వని.. ఫోక్ సాంగ్ సోలో విభాగంలో హిమజ, వి.కీర్తి, కథా రచనలో టి శ్రీవల్లి, షేక్ లీనా రుష్వానా, కవిత్వంలో ఎం.ఓజస్వీ, జి శ్రీనిఖి, చిత్రలేఖనంలో రోహిత్ కుమార్, నిహాల్ కుమార్, ప్రసంగంలో ఎం. ఓజస్వీ, ఎం.పవన్‌లు, విజ్ఞానం - సాంకేతికత ప్రాజెక్ట్‌లో జి.రేణుక, బి.కీర్తనలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహం

- నూతన ఆవిష్కరణలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


మంత్రి సమక్షంలో ఎంఓయూలు మార్చుకుంటున్న దృశ్యం

తాడికొండ : సమాజానికి దోహదపడే నూతన ఆవిష్కరణలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వికసిత్ భారత్ కింద దేశంలో స్టార్టప్‌లకు గొప్ప అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అమరావతిలోని విట్ (వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన వికాస్ - 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పెమ్మసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో అతి తక్కువ సంఖ్యలో స్టార్టప్‌లు ఉండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు ఉన్నాయన్నారు. గతంలో యూనికార్న్‌లు నాలుగు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 1,100కు అవి చేరాయని వివరించారు. ఇండియాలో సుస్థిరమైన ప్రగతి కోసం వికసిత్ భారత్, వికాస్ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. తాను నిర్వహిస్తున్న కమ్యూనికేషన్స్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలతోనే దేశం పదేళ్లలో ఆదర్శవంతమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఎంసెట్‌లో తాను 27వ ర్యాంక్ సాధించానని, తనకంటే 26 మంది ముందున్నా, ఆలోచనలు విస్తృతం చేయడం ద్వారా సక్సెస్ సాధించానన్నారు. ఇది యువతకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చించిన మంత్రి పెమ్మసాని.. వర్సిటీ విద్యార్థులతో కూడా మాట్లాడారు.

శింగరకొండ హుండీ ఆదాయం రూ.37.41 లక్షలు



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను శుక్రవారం దేవస్థాన ఆవరణలో లెక్కించారు. నాలుగు నెలలకు రూ. 37.41 లక్షలు, 32 డాలర్లు వచ్చినట్లు దేవస్థాన ఏసీ ఎం.తిమ్మనాయుడు తెలిపారు. కార్యక్రమాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వేటపాలెం: రోడ్డు పక్కన ఆపి ఉన్న వాహనాన్ని వెనక వైపు నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారిలోని పందిళ్లపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. చల్లారెడ్డిపాలెం పంచాయతీ తానా కాలనీలో నివాసం ఉండే పీ వెంకటేశ్వర్లు (55) కడవకుదురు వెళ్లి బైక్‌పై కాలనీకి వస్తున్నాడు. అదే సమయంలో పందిళ్లపల్లి చెక్ పోస్టు వద్ద పక్కన ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని అదుపు తప్పి వెనక వైపు బలంగా ఢీకొట్టాడు. వెంకటేశ్వర్లు కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టిన రోజు వేడుకకు వెళ్తూ మృత్యువాత

బైకుపై నుంచి పడి వృద్ధురాలి మృతి



కారంచేడు: ముని మనుమరాలు పుట్టినరోజు వేడుకకు బయలుదేరిన వృద్ధురాలు గమ్యానికి చేరకముందే మృత్యువు కబళించింది. ఇంకొల్లు ఎస్ఐ సురేష్ వివరాల మేరకు.. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన తిరుమలశెట్టి దమయంతి (70) శుక్రవారం సాయంత్రం స్వర్ణ గ్రామం నుంచి ఇంకొల్లు మీదుగా ఒంగోలుకు మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. ఈ క్రమంలో ఇంకొల్లు మండలం దుద్దుకూరు-రాచపూడి గ్రామాల మధ్య వ్యవసాయ పొలాలకు నీరు పెట్టుకొనే రైతులు పైపులను రోడ్డుపై వేశారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి పైపులు సరిగ్గా కనిపించకపోవడంతో వాహనం ఆ పైపులను ఎక్కింది. ఈ క్రమంలో వాహనంపై వెనుక కూర్చున్న దమయంతి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దమయంతికి భర్త, ఇద్దరు వివాహాలు అయిన కుమారులు ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



వేటపాలెం: జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పీడీ జరుబుల శ్రావణి ఎంపికైనట్లు హెచ్ఎం ఫణి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ గేమ్స్‌లో జిల్లా నుంచి వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పీడీ ప్రతిభ చాటారన్నారు. తద్వారా జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఢిల్లీలో జరగనున్న టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు చెప్పారు. పీడీ శ్రావణిని హెచ్ఎంతోపాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

– ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: బహిరంగ ప్రదేశాల్లో చేబ్రోలు మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లాలో శుక్రవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో జిల్లాలో ఇలా తాగిన 2,231 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 80 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చామని, కేసులు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందుబాబుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు 100, 112 లను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు



వేటపాలెం: బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీ నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అండర్ - 14 విభాగంలో రహీమ్, అజయ్ కుమార్‌లు సత్తా చాటారన్నారు. పిట్టువారిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులను పీడీ కే మమత, విజయకుమార్, దుర్గావరప్రసాద్, సిబ్బంది అభినందించారు.

భారీగా బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: నాటుసారా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నగరం ఎక్సైజ్ సీఐ రాం ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ అదవల గ్రామ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించామన్నారు. నాటు సారా తయారీకి వినియోగించే 1500 లీటర్ల బెల్లం ఊటతోపాటు రెండు బట్టీలు గుర్తించి, ధ్వంసం చేసినట్లు తెలిపారు. తయారీదారులకు నల్లబెల్లం అమ్మే వారిపై చర్యలు తప్పవని తెలిపారు. సిబ్బంది వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి



ఇంకొల్లు (చినగంజాం): స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన దుద్దుకూరు పల్లాయిగుంటలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు.. మండలంలోని దుద్దుకూరు బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటున్న చేజర్ల వరుణ్‌తేజ (13) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లోని వారు ప్రతి రోజు పాఠశాల వదిలిన తరువాత సమీపంలోని పల్లాయిగుంటలో దిగి ఈత కొడుతుంటారు. ఈ క్రమంలో వరుణ్‌తేజ్ లోతుకి వెళ్లడంతో మునిగిపోయాడని ఎస్సై తెలిపారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం ఒంగోలులో నివాసం ఉంటున్నారు. వీరికి వరుణ్‌తేజతోపాటు ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసింది.

ముగ్గురు పందెంరాయుళ్ల అరెస్టు

అమరావతి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీ సమీపంలో శుక్రవారం కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఎం.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను, రెండు కోళ్లను, కోళ్లకాళ్లకు కట్టే ఇరవై కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 1,02,200 రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటుపై రగడ సరికాదు


చల్లా రామయ్యను పరామర్శిస్తున్న కోన రఘుపతి

బాపట్ల: బాపట్ల ప్రాంతాభివృద్ధికి కృషి చేసిన మాజీ గవర్నర్, తన తండ్రి కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటును అడ్డుకోవటం సరికాదని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. ఇదే విషయాన్ని శాంతియుతంగా చెప్పేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్యపై కొంతమంది దాడి చేయటం హేయమైన చర్యగా కోన తెలిపారు. దీనిని ఖండించారు. ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న చల్లా రామయ్యను శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణకు సంబంధించి కొన్ని విగ్రహాలను తొలగించామని, విగ్రహాల ఏర్పాటుకు గతంలో ఒక కమిటీ వేసి తిరిగి వాటిని ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం ఉందని గుర్తు చేశారు. బాపట్ల ప్రాంతాభివృద్ధికి నిత్యం కృషి చేసిన గొప్ప వ్యక్తి విగ్రహం ఏర్పాటును అడ్డుకోవటం బాధ కలిగిస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అంజనీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, అడే చందు ఆయన వెంట ఉన్నారు.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

- ఇప్పటికే వంద లీటర్ల మద్యం స్వాధీనం
- 34 మందిపై కేసులు నమోదు
- ఒంగోలు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్


బాపట్లలో ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన విజయ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఒంగోలు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ చెప్పారు. శుక్రవారం ఆమె బాపట్ల ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో మద్యం షాపుల ఏర్పాటు, బెల్టు షాపుల కట్టడి, నాటుసారా నియంత్రణ, ఎంఆర్‌పీకి మద్యం విక్రయాలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో బెల్టు షాపుల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలో 34 బెల్టు షాపుల నుంచి వంద లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 34 మందిపై కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు చెప్పారు. 4,600 లీటర్ల ఊట ధ్వంసం చేసి, 28 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం షాపుల్లో ఎంఆర్‌పీకే విక్రయించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఈఎస్ దేవదత్తు, ఏఈఎస్ వెంకటేశ్వర్లు, జనార్దనరావు, సీఐ గీతిక తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


నారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

అద్దంకి రూరల్: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. తేలుకుట్ల నారాయణ (27) ప్రకాశం జిల్లా మండ్లమూరు మండలం భట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం అద్దంకిలోని తన మిత్రులతో కలిసి గుండ్లకమ్మ నదిలో ఈతకు వచ్చాడు. నది ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. మిత్రులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ, సిబ్బంది వచ్చి గురువారం సాయంత్రం నుంచి గాలించినా ఆచూకీ తెలియలేదు. శుక్రవారం ఉదయం నుంచి ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బోట్లపై తిరుగుతూ గాలించారు. నారాయణ మృతదేహాన్ని గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నారాయణకు భార్య, ఒక పాప ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భంతో ఉన్నారు. నారాయణ మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

గ్రామీణులకు ఉపయోగపడేలా ప్రణాళికలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చేలా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపకల్పనపై గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. దేశంలో 70 శాతం మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని తెలిపారు. గ్రామాల నుంచి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని చాలామంది ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారని అన్నారు. గ్రామాలను అభివృద్ధి పర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పంచాయతీ వనరుల కేంద్ర జిల్లా సమన్వయకర్త షీలా పద్మారాణి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తారని తెలిపారు. జనవరి నెలలో గ్రామస్థాయి, ఫిబ్రవరిలో మండల స్థాయి, మార్చి నెలలో జిల్లాస్థాయిలో ప్రణాళికల ద్వారా నిర్దేశించిన కార్యక్రమాలను పూర్తి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో నాగసాయికుమార్, జేడీ ఆర్. కేశవరెడ్డి, జెడ్పీ సీఈవో బి. జ్యోతిబసు, డాక్టర్ మోహన్, కె. జియాబేగం, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర బౌలర్ల విజృంభణ



4 చొప్పున వికెట్లు తీసిన బి.యశ్వంత్, ఏఎస్ఎస్ లోహిత్


అర్ధ సెంచరీతో రాణించిన ఆర్పిత్ సింగ్

- 132 పరుగులకే కుప్పకూలిన హిమాచల్ ప్రదేశ్
- 352 పరుగుల భారీ ఆధిక్యంలో ఆంధ్ర జట్టు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కుచ్ బెహరా ట్రోఫీలో ఆంధ్ర జట్టు తన ఆధిపత్యాన్ని చాటింది. 615 పరుగుల భారీ స్కోర్‌తో డిక్లేర్ చేసిన ఆ జట్టు.. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌పై బౌలింగ్‌లోనూ రాణించింది. మూడవ రోజు శుక్రవారం ఓవర్‌నైట్ స్కోర్ 50 పరుగులతో బ్యాటింగ్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు ఆంధ్ర బౌలర్ల ధాటికి 60.4 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు బి.యశ్వంత్, ఏఎస్ఎస్ లోహిత్‌లు చెలరేగి చెరో నాలుగు వికెట్లు తీశారు. హిమాచల్ ప్రదేశ్ బ్యాటర్ ఆర్పిత్‌సింగ్ మాత్రమే రాణించి 52 పరుగులు సాధించాడు, అనంతరం రెండవ ఇన్నింగ్స్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 52 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లు ఎన్.రాజేష్, ఏవీఎస్ లోహిత్ చెరో రెండు వికెట్లు తీశారు. మూడవ రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 352 పరుగుల ఆధిక్యంలో వుంది.

నగరాభివృద్ధిలో యూనిడో భాగస్వామ్యం కీలకం


యూనిడో ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరాభివృద్ధిలో యూనిడో భాగస్వామ్యం ఎంతో అభినందనీయమని, భవిష్యత్‌లో మరిన్ని నూతన ప్రాజెక్ట్‌ల ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యూనిడో) సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ నందపాల్ సింగ్, నేషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దీపికా శ్రీపాద్‌లతో నగరపాలక సంస్థ కమిషనర్ తన చాంబర్‌లో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాలుష్యరహితంగా గుంటూరు నగరాన్ని మార్చుకోవడంలో యూనిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జీఈఎఫ్) ద్వారా సంపూర్ణ సహకారం లభిస్తోందని చెప్పారు. ఇప్పటికే సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు, ఈ-ఆటోలకు రూ.10 కోట్ల నిధులు అందించారని తెలిపారు. గుంటూరు కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన ప్రాజెక్ట్‌లకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■ గుంటూరు సిటీలోని విద్యానగర్ 3/7లో కాకతీయరోడ్‌లో నిహారిక హోమ్స్ అపార్ట్‌మెంట్స్‌లో 2BHK,3BHK అన్ని వసతులతో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఫ్లాట్స్ అమ్మకానికికలవు ✆ 9248483447, 9490639699

■ వర్షిత నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వే గేట్ దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ పొంటిన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలే. ఫోన్ : 98481 10543, 88855 86086

LAND FOR SALE

■ విజయవాడ To హైదరాబాద్ హైవేఫేసింగ్ కమర్షియల్ ల్యాండ్ 4ఎకరములు కలదు. బకారిక్ బ్రిడ్జికి 300 మీటర్స్‌లో కోర్ క్యాపిటల్ అమరావతికి 7కి.మీ దగ్గరలో సంప్ర: 93477 56501.

■ విజయవాడ To నున్న, నూజివీడు రోడ్ ఫేసింగ్ 5ఎకరాలు కమర్షియల్ ల్యాండ్ షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్, హోటల్స్ వర్కస్‌కు కలదు. సంప్రదించండి. 89048 05198.

TO-LET COMMERCAIL

■ నల్లపాడు శైలానగరి టింపుల్ దగ్గరలో 500గజాల స్థలంలో 2గదుల ఇల్లు, బోరెవెల్, ఫెన్సింగ్‌తో గేట్, CC కెమెరల తో కమర్షియల్ కి రెంట్‌కు కలదు. ✆ 98662 85503

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ ఉచితంగా Solar Technician Course 3నెలలు కాలవ్యవధిలో నేర్పించి ఉపాధి చూపించబడును. ఉచితభోజనం & హాస్టల్ Only for ITI/ Diploma/EEE వ:18-30 సం ✆ 9177133358

■ తెనాలి అప్పడాల కంపెనీలో పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 15000/- రూపాయలు. సంప్ర।। ✆ 92999 93959

■ అమరావతి రోడ్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు అనుభవం గల లేడీ టెలికాలర్స్ కావలెను. సంప్ర।। ✆ 95500 08995

■ Work From Home: Required Ladies & Gents with Degree/ B.Tech Background for an Educational Company in Guntur. 9063183834, 7396992444

■ 10th,ఇంటర్,డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్. 9963255441

■ గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు PROలు కావలెను. Q: ఇంటర్ ఆపైన, బైక్ ఉన్న వాళ్ళకి ప్రాధాన్యత కలదు. సంప్ర।। ✆ 99484 94667.

■ ప్రముఖ టోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ &క్యాషియర్ కావలెను. 8 గం।। డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం. Loc: గుంటూరు. 89196 13904.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అభ్యర్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818682.

■ Wanted Sales Girls at Misbah Organics Ponnur road, Anandapet, Beside Panchavati Appartments, Guntur. Age : 18 to 35 yrs ✆ 81210 12755

■ గుంటూరు RTC బస్టాండ్ దగ్గర ప్రముఖ ఆఫీస్‌నందు పనిచేయుటకు గర్ల్స్&బాయ్స్ కావలెను. వయస్సు: 30సం।।లోపు వారు. మంచిజీతం. సంప్ర।। ✆ 7396717777

■ Start up కంపెనీ నందు పని చేయుటకు M/F స్టాఫ్ కావలెను (Fresh or 1సం।। Exp) అ-డిగ్రీ, కంప్యూటర్ నాలెడ్జ్. సంప్ర।। ✆ 6303666807

■ బార్ & రెస్టారెంట్ నందు పనిచేయుటకు P/T, F/T క్యాషియర్లు, సప్లయర్లు, వెయిటర్లు కావలెను. భోజన వసతి సౌకర్యం కలదు ✆ 8143198968, 9573271161

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499

■ వాచ్‌మెన్ కావలెను. గుంటూరులోని కమర్షియల్ కాంప్లెక్స్‌నందు పని చేయుటకు 40 సం।।లు లోపు భార్యాభర్తలు కావలెను. గృహవసతి కలదు. Ph: 9849983681

■ ప్రముఖ కంపెనీ అగ్రి, ప్రాపర్టీ, బిజినెస్ కొరకు ఏజెంట్స్ DMA, DSA కావలెను. మంచి జీతం & కమీషన్ : 9518675529

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్
రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనలదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.